సాక్షి 24|7

అనంతపురం

ఆదివారం 7-1-2018



నేడు 'సాక్షి' ముగ్గుల పోటీ

సమయం: ఆదివారం ఉదయం 10 గంటలకు

వేదిక: జూనియర్ కళాశాల, కొత్తూరు, అనంతపురం

సంప్రదించాల్సిన ఫోన్ నెంబర్లు
08554-248896,
90523 00933, 98490 67681

2లో▸




దళితుల్లేకపోతే హిందూ మతమెక్కడిది

దళితుల్లేకపోతే హిందూ మతం ఎక్కడిదని శారదా పీఠాధిపతులు శ్రీ స్వరూపానందేంద్ర సరస్వతి స్వామీజీ అన్నారు. శనివారం ఆయన అనంతపురం హరిజనవాడలోని కోదండ రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

4లో▸

కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం ఆంజనేయులు



నేను పుట్టి పెరిగిన అనంతపురం అంటే ఎంతో అభిమానం. ఇదే 'తిమ్మమాంబ మర్రిమాను చరిత్ర' రచనకు కారణమైంది. ఆ స్పందన ఎంతగా ఉందంటే.. ఓ నిర్మాత ప్రోత్సాహంతో సినిమా తీసేంత ఉత్సాహాన్నిచ్చింది. ఆ తర్వాత.. 'సతీ తిమ్మమాంబ' పేరుతో సినిమా తీయడమే కాకుండా కథ, సంభాషణలు, స్క్రీన్‌ప్లే, దర్శకత్వ బాధ్యతలు చేపట్టేందుకు దోహదపడింది. అంతేకాదు.. సినిమాలో ఓ మంచి పాత్రలోనూ నటించడం ఎప్పటికీ మర్చిపోలేను. ప్రపంచ స్థాయిని ఆకర్షించిన తిమ్మమ్మ మర్రిమాను పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చెందడంలో నా సినిమా పాత్ర కూడా ఉందనే చర్చతో నా జీవితం సార్థకమైందని భావిస్తా.

6లో

ఆహా.. ఏమి రుచి

10లో



అనంతపురం | ఆదివారం | జనవరి | 7 | 2018
సాక్షి

కిరాయి హంతక ముఠా అరెస్ట్

- మూడు వేట కొడవళ్లు స్వాధీనం
- జంట హత్యలకు పన్నినకుట్ర భగ్నం



అరెస్ట్ వివరాలను తెలియజేస్తున్న సీఐ గోరంట్ల మాధవ్

కదిరి: కిరాయి హత్యలు చేసే ముఠాను కదిరి పట్టణ పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. వీరి నుంచి మూడు వేట కొడవళ్లు స్వాధీనం చేసుకున్నారు. అరెస్ట్ అయిన వారిలో కదిరి మండలం కుమ్మరవాండ్లపల్లికి చెందిన జరిపిటి రవీంద్ర అలియాస్ ఆటో రవి, పోలినేని రాంబాబు, కదిరి పట్టణంలోని జామియా మసీదు వీధికి చెందిన ఎస్.మౌళా, ఫారూక్ షంషీర్, బిలాల్ నగర్‌కు చెందిన షావుద్దీన్, బాబ్జాన్ ఉన్నారు. జంట హత్యలకు వీరు పన్నిన కుట్రనూ పోలీసులు భగ్నం చేశారు. ఇందుకు సంబందించిన వివరాలను సీఐ గోరంట్ల మాధవ్ తన చాంబర్‌లో మీడియాకు వెల్లడించారు. కదిరి–సున్నపుగుట్ట తండా మార్గ మధ్యంలో ఉన్న వాటర్ ట్యాంకు దగ్గర కొందరు వ్యక్తులు వేటకొడవళ్లను పట్టుకొని ఉన్నారని డీఎస్పీ శ్రీలక్ష్మికి సమాచారం అందింది. డీఎస్పీ వెంటనే పట్టణ సీఐ గోరంట్లమాధవ్, ఎస్‌ఐలు హేమంత్‌కుమార్, గోపాలుడు, పోలీస్ సిబ్బందిని అక్కడికి పంపించారు. ముఠాను వారు అదుపులోకి తీసుకొని విచారించగా కుమ్మరవాండ్లపల్లికి చెందిన భాగ్యమ్మ భర్తను అప్పట్లో ఆమె దగ్గర కొంత డబ్బుతీసుకొని హత్య చేసిన కేసులో తామంతా నిందితులమని అంగీకరించారు. 'నేను అప్పట్లో జైలుకు వెళ్లినప్పుడు నా తండ్రి గంగరాజు కోడలని కూడా చూడకుండా నా భార్యతో అసభ్యంగా ప్రవర్తించాడు. అందుకే ఆయన్ను చంపాలని గతంలో భాగ్యమ్మ భర్తను హత్య చేసిన ముఠాతో కలిసి ప్లాన్ వేశాం' అని జరిపిటి రవీంద్ర అలియాస్ ఆటోరవి పోలీసుల విచారణలో ఒప్పుకున్నాడు.అలాగే మూర్తిపల్లికి చెందిన రాంబాబుకు ఆయన పెదనాన్న కొడుకు వెంకటరమణకు భూ తగాదాలు ఉండేవన్నాడు. అందుకే వెంకటరమణను చంపేందుకు తమకు రాంబాబు రూ.3 లక్షలు ఇస్తానని ఒప్పందం కుదుర్చుకున్నాడని, అడ్వాన్స్‌గా రూ.10 వేలు ఇచ్చినట్లు ఈ ముఠా పోలీసుల ఎదుట అంగీకరించింది. తాము త్వరగా వెళ్లి ముఠాను అరెస్ట్ చేయకపోతే.. జంట హత్యలు జరిగేవని సీఐ తెలిపారు. అనంతరం ఈ ముఠాను కోర్టులో హాజరు పరచగా మెజిస్ట్రేట్ రిమాండ్‌కు ఆదేశించారు.

నేడు 'సాక్షి' ముగ్గుల పోటీ



అనంతపురం కల్చరల్: సంక్రాంతి పర్వదినాలను పురస్కరించుకుని సాక్షి మీడియా గ్రూప్, ఫర్నిచర్ వరల్డ్ సంయుక్త ఆధ్వర్యంలో తెలుగువారి సంస్కృతికి అద్దం పట్టే ముగ్గుల పోటీలు ఆదివారం (7.1.18) జరగనున్నాయి. స్థానిక జూనియర్ కళాశాలలో ఉదయం 10 గంటలకు పోటీలు ప్రారంభమవుతాయి. ఏటా మహిళలు తమలోని సృజనాత్మకతను చాటుకోవడానికి 'సాక్షి' చక్కటి వేదిక కల్పిస్తోంది. సంప్రదాయాలను ఘనంగా చాటే ముగ్గుల పోటీల విజేతలకు మంచి బహుమతులను అందజేయనున్నారు. మొదటి బహుమతిగా సోఫాసెట్, ద్వితీయ బహుమతిగా డబుల్ కాట్, తృతీయ బహుమతిగా డ్రస్సింగ్ మిర్రర్ అందిస్తారు. అలాగే మరో పది కన్సోలేషన్ బహుమతులు కూడా పంపిణీ చేయనున్నారు. ముందుగా పేర్లను నమోదు చేసుకోలేని వారు కూడా నేరుగా పోటీలలో పాల్గొనవచ్చు.

మానని గాయం



ఘాట్ రోడ్‌లో పడిపోయిన ఆర్టీసీ బస్సు, చనిపోయిన విద్యార్థులు (ఫైల్)

మూడేళ్ల కిందట జరిగిన రోడ్డు ప్రమాదం అనేక కుటుంబాల్లో చీకటి నింపింది. నేటికీ ఈ ఘటన మానని గాయంలా ఆ కుటుంబాలను వెంటాడుతోంది. ఆరిపోయిన తమ కంటి పాపలను తలచుకుంటూ తల్లిదండ్రులు విషాదం నుంచి తేరుకోలేదు. గాయపడిన పలువురు బాధితులు ఇప్పడిప్పడే కోలుకుంటుండగా.. మరి కొందరు మంచానికే పరిమితమై జీవచ్ఛవాలుగా ఉన్నారు. ప్రభుత్వం నుంచి పూర్తిస్థాయి సాయం అందక మరింత ఇబ్బందులు పడుతున్నారు. ఇక ప్రమాదానికి కేంద్రబిందువైన ఆర్టీసీ సంస్థ బాధితులకు న్యాయం చేయడానికి ఇప్పటికీ ముందుకు రావడం లేదు. - పెనుకొండ

అందని సాయం..

- అనేక కుటుంబాల్లో విషాదం
- వైద్యం చేయించుకోలేని దుస్థితిలో బాధితులు
- పెనుకొండ బస్సు ప్రమాద ఘటనకు నేటితో మూడేళ్లు

సీఎం హామీకి విలువ లేదా?

రెండేళ్ల క్రితం రొద్దం మండలం పెద్దమంతూరు రొప్పాల వద్దకు సీఎం చంద్రబాబు నాయుడు వచ్చిన సందర్భంలో ప్రమాదంలో గాయపడి కాళ్లు చచ్చుబడిపోయిన మేకలపల్లికి చెందిన కురుబ రాధ తల్లిదండ్రులు రామాంజినప్ప, లక్ష్మీదేవమ్మల వినతి మేరకు రూ. 8 లక్షల ఆర్థిక సాయం ప్రకటించారు. కానీ నేటికీ బాధిత కుటుంబానికి న్యాయం జరగలేదు. ఎమ్మెల్యే బీకే.పార్థసారథి చుట్టూ లెక్కలేనన్ని సార్లు ప్రదక్షిణలు చేశారు. కానీ ఆయన పట్టించుకున్న పాపాన పోలేదు.

ఆ రోజు ఏం జరిగిందంటే..

2015 జనవరి 7 ఉదయం 7 గంటల ప్రాంతంలో మడకశిర నుంచి పెనుకొండకు పల్లె వెలుగు ఆర్టీసీ బస్ వస్తోంది. 7.40 గంటల ప్రాంతంలో పెనుకొండ మండలం మావటూరు, నాగలూరు, బండపల్లి, సోమందేపల్లి మండలం ఆనందాపురం తదితర గ్రామాల విద్యార్థులు, రైతులు ఎక్కారు. డ్రైవర్ క్రిష్టప్ప వేగంపై నియంత్రణ కోల్పోవడంతో మడకశిర ఘాట్ రోడ్‌లోని లోయలాంటి ప్రాంతంలోకి బస్ పడిపోయింది. ఈ ప్రమాదంలో అనిల్, అశోక్, నరసింహమూర్తి, గంగాధర్, నరేంద్ర, లక్ష్మినారాయణ, గంగాధర్‌తో పాటు మొత్తం 15 మంది మత్యువాతపడగా... చికిత్స పొందుతూ డ్రైవర్ సైతం మరణించారు. దాదాపు 90 మంది గాయపడ్డారు.

గాయాలు చూస్తే కన్నీరే..

ప్రాణాపాయం నుంచి బయటపడిన మూలింటి రమణ గాయాలతో పడుతున్న బాధను చూస్తే ఎవ్వరైనా కంటతడి పెట్టాల్సిందే. మూడేళ్లుగా మంచానికే పరిమితమై లేవలేక, కోర్చోలేక నడుము, పిరుదులపై పెద్దపెద్ద గాయాలయ్యాయి. కనీసం చికిత్స చేయించుకోలేని దుస్థితి ఆ కుటుంబానిది. వికలాంగుడై తండ్రి శ్రీనివాసులు తనకు వచ్చే పింఛన్‌తో ప్రతినెలా రూ. 1000 ఖర్చు పెట్టి కుమారుడికి మందులు తెప్పించి ప్రాణాలు కాపాడుతున్నాడు.

సాయం కోసం ఆర్టీసీ చుట్టూ ప్రదక్షిణలు

ఆర్టీసీ పల్లె వెలుగు బస్సు ప్రమాదంలో మరణించిన, గాయపడిన వారి కుటుంబాలు ఆర్టీసీ నుంచి పరిహారం కోసం మూడేళ్లుగా హిందూపురం కోర్టు చుట్టూ తిరుగుతున్నారు. వాయిదాలతో తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. బాధితులకు పరిహారం అందించడానికి అనేక మెలికలతో ఆర్టీసీ వారిని మనోవేదనకు గురిచేస్తోంది. తమకు న్యాయం ఎపుడు జరుగుతుందోనని బాధితులు ఎదురు చూస్తున్నారు.

సాయంలోనూ నిర్లక్ష్యమే..

బస్సు ప్రమాదం జరిగిన అనంతరం మంత్రి పరిటాల సునీత సమీప బంధువు ఘాట్‌రోడ్ పనులు చేస్తుండడంతో అప్రమత్తమైన పాలకులు, అధికారులు ప్రమాదాన్ని ఆర్టీసీపై నెట్టారు. డ్రైవర్ నిర్లక్ష్యాన్ని ప్రశ్నించారు. కనీసం బాధితులను పరామర్శించడానికి సైతం ముందుకు రాలేదు. ఈ నేపథ్యంలో బాధిత కుటుంబాల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమైంది. వైఎస్సార్‌సీపీ పెనుకొండ నియోజకవర్గ సమన్వయ కర్త శంకరనారాయణ ప్రమాద విషయాన్ని ప్రతిపక్షనేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వివరించడంతో ఆయన వెంటనే ప్రమాద స్థలాన్ని సందర్శించి బాదితులను పరామర్శించారు. పార్టీ తరపున సాయం అందిస్తామని పేర్కొన్నారు. ప్రతిపక్షనేత స్పందనతో దిగివచ్చిన ప్రభుత్వం వెంటనే మృతుల కుటుంబాలకు రూ. 5 లక్షలు, గాయపడిన వారికి రూ. 2 లక్షలు పరిహారం ప్రకటించి అనంతరం అందజేశారు. ఇందులో కొందరు బాధితులు తమకు ఇప్పటికీ న్యాయం జరగలేదని, కలెక్టర్ కార్యాలయం చుట్టూ తిరిగి నిరాశతో మిన్నకుండిపోయారు.

“ ఉద్యోగం ఇచ్చి ఆదుకోవాలి



ఇక నా జీవితం అంధకారమే. పని చేయలేను. కాళ్లు పూర్తి చచ్చుబడిపోయాయి. ప్ర భుత్వం నన్ను ఆదుకుని ఆర్టీసీలో కానీ, ఇతర శాఖల్లో కానీ మానవతా దృక్పథంతో ఉద్యోగం ఇచ్చి ఆదుకోవాలి. జీవచ్ఛవంలా ఉన్న నాకు చేయూత ఇవ్వాలి. అమ్మానాన్నలు పడుతున్న వేదన అంతా ఇంతా కాదు. నెలనెలా మందులు కొనలేని దుస్థితిలో ఉన్నాం.

– మూలింటి రమణ, మావటూరు, పెనుకొండ మండలం

జీవితానికి వెలుగునివ్వండి



ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నాకు ఫిజియోథెరపీకి సాయం చేస్తానని ప్రకటించిన రూ. 8లక్షల సాయం దయతో అందించండి. అందరిలాగే మళ్లీ నడవాలని, చదవాలని ఉంది. ఫిజియోథెరపీ చేస్తే నడవగలవని వైద్యులు చెబుతున్నారు. అంధకారంలో ఉన్న నా జీవితానికి వెలుగు నివ్వండి.

– కురుబ రాధ, మేకలపల్లి, సోమందేపల్లి మండలం ”

మెట్లపై నుంచి పడి వ్యక్తి మృతి

హిందూపురం అర్బన్: పట్టణంలోని ముద్దిరెడ్డిపల్లి వెంకటేశ్వరనగర్‌కు చెందిన రామాంజినేయులు (45) శుక్రవారం రాత్రి మేడపైకి మెట్లు ఎక్కుతూ ప్రమాదవశాత్తూ జారి కింద పడి మృతిచెందినట్లు వన్‌టౌన్ సీఐ చిన్నగోవిందు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేశామన్నారు.

ఎడ్లను అదుపుచేయబోయి రైతు దుర్మరణం



మృతుడు రాజన్న

బ్రహ్మసముద్రం : ఎద్దులు బెదిరి పరుగులు ఎడ్లను అదుపు చేయబోయి రైతు ఎడ్లబండి కింద పడి దుర్మరణం చెందాడు. వివరాలిలా ఉన్నాయి. గుండిగానపల్లికి చెందిన రాజన్న (45) అనే రైతు వారం రోజులక్రితం కొత్తగా ఎడ్లను కొన్నారు. శుక్రవారం పొలం వెళ్లేందుకని ఎడ్లను బండికి కట్టి వాటి మూతికి చిక్కాలు తీసుకురావడానికి ఇంట్లోకి వెళ్లాడు. ఆ సమయంలో ఎడ్లు బెదిరి బండిని లాక్కుపోవడంతో అదుపు చేయడానికి ప్రయత్నించిన రాజన్న అడ్డంగా వెళ్లి బండికింద పడిపోయాడు. తీవ్రంగా గాయపడిన అతడిని రాయదుర్గంలో ప్రథమ చికిత్స అనంతరం బళ్లారి ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు.

రూ. 70 లక్షల గుట్కా పట్టివేత

గుమ్మిడిపూండి: ఆంధ్రప్రదేశ్ నుంచి తమిళనాడుకు అక్రమంగా రవాణా చేస్తున్న రూ.70 లక్షల విలువైన గుట్కా బస్తాలను తమిళనాడులోని గుమ్మిడిపూండి సమీపంలో గల కవరైపేటలో పోలీసులు పట్టుకున్నారు. ఇద్దరిని అరెస్ట్ చేశారు. పోలీసుల వివరాల మేరకు.. గుమ్మిడిపూండి సమీపంలోని కవరపేట వద్ద తిరువళ్లూరు జిల్లా ఎస్పీ శిబిచక్రవర్తి నేతృత్వంలో గుమ్మిడిపూండి డీఎస్పీ రాజన్ ఆధ్వర్యంలో ప్రత్యేక పోలీస్ బృందం శనివారం తెల్లావారుజామున ఆంధ్రా నుంచి చెన్నైలోకి వచ్చే వాహనాలను తనిఖీ చేస్తున్నారు. బెంగళూరు నుంచి వస్తున్న ఓ లారీని పోలీసులు తనిఖీ చేయగా లారీలో దుస్తులు, కోడిగుడ్లు కనిపించాయి. వాటి కింద ఉంచిన 12 బస్తాల గుట్కాను గుర్తించి, స్వాధీనం చేసుకున్నారు. అంధ్రప్రదేశ్‌లోని అనంతపురానికి చెందిన డ్రైవర్‌ఖాసీం, క్లీనర్ నాగరాజులను పోలీసులు అరెస్టుచేశారు. స్వాదీనం చేసుకున్న గుట్కాల విలువ దాదాపు రూ.70లక్షలు ఉంటుందని శిబిచక్రవర్తి తెలిపారు.

చైతన్యంతోనే రోడ్డు ప్రమాదాల నివారణ

అనంతపురం సెంట్రల్: రోడ్డు ప్రమాదాలు నివారించాలంటే తొలుత ప్రజల్లో చైతన్యం రావాలని అనంతపురం రేంజ్ డీఐజీ ప్రభాకర్‌రావు పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణ కోసం రూపొందించిన ‘పంచసూత్రాలు’ లోగో, లఘు చిత్రాల సీడీలను శనివారం పోలీసు కాన్ఫరెన్స్‌హాల్లో ఎస్పీ జీవీజీ అశోక్‌కుమార్‌తో కలిసి ఆయన ఆవిష్కరించారు. డీఐజీ మాట్లాడుతూ మూడేళ్లుగా జిల్లాలో రోడ్డు ప్రమాదాలు తగ్గుముఖం పట్టాయన్నారు. 2015లో 690 మంది మృత్యువాత పడ్డారని, 2016లో 666 మంది చనిపోయారన్నారు. ఎస్పీ అశోక్‌కుమార్ తీసుకున్న



పంచసూత్రాల లోగోను ఆవిష్కరిస్తున్న డీఐజీ, ఎస్పీ

చర్యల ఫలితంగా మృతుల సంఖ్య 2017లో 500 మందికి తగ్గిందన్నారు. జిల్లాలో తీసుకుంటున్న రోడ్డు భద్రతా చర్యలు ఇతర జిల్లాలకు ఆదర్శంగా నిలుస్తున్నాయని అభినందించారు. ఎస్పీ మాట్లాడుతూ గతేడాది కంటే రోడ్డు ప్రమాదాలు 6.6శాతం తగ్గాయని వివరించారు. పంచసూత్రాలు రూపొందించి అమలు చేయడం వలన మంచి ఫలితాలు వచ్చాయని తెలిపారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ మాల్యాద్రి, ఓఎస్‌డీ ఐశ్వర్యరస్తోగి, డీఎస్పీ వెంకట్రావ్, లఘుచిత్రాల రూపకర్తలు సునీల్, హైమారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భవిష్యం

మేషం: కొన్ని వ్యవహారాలు ముందుకు సాగవు. వృథా ఖర్చులు. కుటుంబంలో చికాకులు. మానసిక అశాంతి. వృత్తి, వ్యాపారాలు సామాన్యంగా ఉంటాయి.

వృషభం: రాబడి కన్నా ఖర్చులు పెరుగుతాయి. దూరప్రయాణాలు. బాధ్యతలు పెరుగుతాయి. అనారోగ్యం. వ్యాపారాలు ముందుకు సాగవు. ఉద్యోగాలలో చిక్కులు.

మిథునం: ఆసక్తికరమైన సమాచారం. విందువినోదాలు. ఆదాయం సంతృప్తికరంగా ఉంటుంది. ఇంటర్వ్యూలు అందుతాయి. వ్యాపార, ఉద్యోగాలలో అనుకూలత.



కర్కాటకం: ఆదాయానికి మించి ఖర్చులు. దూరప్రయాణాలు. బంధువులతో తగాదాలు. ఆలోచనలు స్థిరంగా ఉండవు. దేవాలయాలు సందర్శిస్తారు. వ్యాపారాలు, ఉద్యోగాలలో చికాకులు.

సింహం: నూతన కార్యక్రమాలను ప్రారంభిస్తారు. విలువైన వస్తువులు కొంటారు. వ్యాపార, ఉద్యోగాలలో అనుకూలమైన పరిస్థితి. దేవాలయాలు సందర్శిస్తారు.

కన్య: బంధువులతో తగాదాలు. కష్టానికి తగ్గ ఫలితం కనిపించదు. ఆస్తి వివాదాలు. పనుల్లో ఆటంకాలు. వ్యాపారాలు, ఉద్యోగాలలో ఒడిదుడుకులు. కళాకారులకు గందరగోళ పరిస్థితి.

తుల: ఉద్యోగ యోగం. కీలక నిర్ణయాలు తీసుకుంటారు. పరిస్థితులు అనుకూలిస్తాయి. బంధువుల కలయిక. వ్యాపార, ఉద్యోగాలలో ఒత్తిడులు తొలగుతాయి. దేవాలయ దర్శనాలు.

వృశ్చికం: ఆసక్తికరమైన సమాచారం. విందు వినోదాలు. యత్నకార్యసిద్ధి. మీ అంచనాలు నిజమవుతాయి. స్థిరాస్తి వృద్ధి. వృత్తి, వ్యాపారాలలో ప్రోత్సాహం.

ధనుస్సు: ఆదాయం తగ్గుతుంది. మానసిక ఆందోళన. దూర ప్రయాణాలు చేస్తారు. బాధ్యతలు పెరుగుతాయి. వ్యాపారాలు, ఉద్యోగాలలో ఒత్తిడులు.

మకరం: కుటుంబ, ఆరోగ్య సమస్యలు. మానసిక ఆందోళన కలిగే అవకాశం ఉంది. ఆలోచనలు స్థిరంగా ఉండవు. పనులలో ఆటంకాలు. ఆలయ దర్శనాలు. వృత్తి, వ్యాపారాలు సాదాసీదాగా ఉంటాయి.

కుంభం: ఉద్యోగ ప్రయత్నాలలో ముందడుగు. ఆదాయం సంతృప్తికరంగా ఉంటుంది. సన్నిహితులు, వాహన యోగం. వృత్తి, వ్యాపారాలు అభివృద్ధి దాయకంగా ఉంటాయి.

మీనం: కొత్త విషయాలు గ్రహిస్తారు. చిన్ననాటి స్నేహితులను కలుసుకుంటారు. పరిచయాలు పెరుగుతాయి. మీ ఊహలు నిజం కాగలవు. శుభ వర్తమానాలు. వ్యాపారాలు, ఉద్యోగాలలో ముందుకు సాగుతారు.

– సింహంభట్ల సుబ్బారావు

దళితుల్లేకపోతే హిందూ మతమెక్కడిది?



స్వామివారి ఆశీస్సులందుకుంటున్న ఉరవకొండ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి



పూజలు నిర్వహిస్తున్న స్వామీజీ

- శారదా పీఠాధిపతులు శ్రీ స్వరూపానందేంద్ర సరస్వతి స్వామీజీ

అనంతపురం కల్చరల్:

దళితులు లేకపోతే హిందూ మతమెక్కడుందని, కుహానా లౌకిక వాదులు సమాజాన్ని కుల పరంగా విభజించారని శారదా పీఠాధిపతులు శ్రీ స్వరూపానందేంద్ర సరస్వతి స్వామీజీ అన్నారు. నాలుగు రోజుల పర్యటనలో భాగంగా శనివారం స్వామీజీ పలు ఆలయాల్లో నిర్వహించిన ధార్మిక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఉదయం స్థానిక హరిజనవాడ (అంబేడ్కర్ నగర్)లోని కోదండ రామాలయంలో రాముల వారికి పూజలు నిర్వహించారు. అనంతరం స్వామీజీ మాట్లాడుతూ దళితులు ఆలయాల్లో అంతర్భాగమని.. వారిని దూరంగా ఉంచడం తగదన్నారు. తమ పర్యటనల్లో ప్రత్యేకంగా ప్రతి దళితవాడలో చైతన్య సదస్సులు నిర్వహిస్తుంటామని, అనంత పర్యటనలో స్థానికుల ఆదరణ ఎంతో స్ఫూర్తిదాయకమన్నారు. భగవంతుడైన ఆంజనేయుడు గిరిజన తెగకు చెందిన వాడని, వివాహ సమయాల్లో తప్పనిసరిగా చూడాల్సిన అరుంధతి దళిత జాతికి మహిళేనన్నారు. ఇలా హిందూ వైవాహిక వ్యవస్థలో వారి ప్రాధాన్యత అనిర్వచనీయమన్నారు. ఆలయాల్లో అర్హులైన హరిజనులు పూజాది కార్యక్రమాలు నిర్వహించడానికి అందరూ కృషి చేయాలని సూచించారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో టీటీడీ దళిత గోవింద కార్యక్రమాన్ని తామే ప్రభుత్వానికి సూచించామన్నారు. ఇతర మతాల వైపు ఎవరూ చూడకుండా అందరిని కలుపుకుపోవాల్సిన అవసరం నేటి సమాజంపై ఉందన్నారు.



దళిత కాలనీవాసులతో మాట్లాడుతున్న స్వామీజీ

- స్థానిక రామనగర్‌లోని బ్రాహ్మణ సంఘం కార్యాలయంలో సాయంత్రం భక్తులకు ఆశీస్సులందించారు. అనంతరం జరిగిన విలేకర్ల సమావేశంలో రాష్ట్ర బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు జ్వాలాపురం శ్రీకాంత్‌తో పాటు స్వామీజీ మాట్లాడారు. పవిత్ర విజయవాడ దుర్గమ్మ ఆలయంలో జరిగిన తాంత్రిక పూజలపై పారదర్శకంగా విచారణ జరపాలని ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. ఈ సందర్భంగా దేవాదాయశాఖ మంత్రి తీరును ఖండించారు.

చంద్రమౌళీశ్వరునికి అభిషేకం

- రాత్రి స్థానిక మారుతీనగర్‌లోని శ్రీకోదండరామాలయంలో నిర్వహించిన చంద్రమౌళీశ్వర అభిషేకాలు, పీఠ పూజల్లో పాల్గొన్నారు. వేద మంత్రాల నడుమ మహాశివునికి పవిత్ర జలాలతో అభిషేకించారు. అనంతరం శ్రీవైష్ణవ సంఘం ఆధ్వర్యంలో జరిగిన ప్రత్యేక గోదాదేవి పూజల్లో పాల్గొని భక్తులకు తీర్థప్రసాదాలను అందించారు. కార్యక్రమంలో రాష్ట్ర బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు జ్వాలాపురం శ్రీకాంత్, శ్రీ శారదాపీఠం ధర్మాధికారి కామేశ్వర శర్మ, బాలస్వామి కిరణ్‌శర్మ, ఆస్థాన పండితులు కృష్ణశర్మ, బ్రాహ్మణ సమాఖ్య యువసేన జిల్లా అధ్యక్షుడు శివకుమార్, డాక్టర్ కేశన్న తదితరులు పాల్గొన్నారు.

నేడు స్వామీజీ పర్యటన ఇలా..

ఆదివారం ఉదయం స్థానిక రామనగర్‌లోని బ్రాహ్మణ సంఘం కార్యాలయంలో నిర్వహించే బ్రాహ్మణ చైతన్య సదస్సులో స్వామివారు విశిష్ట అతిథిగా హాజరవుతారు. అలాగే భక్తుల ఇంట పాదపూజల్లో పాల్గొంటారు.

తిరుమల సమాచారం



తిరుమలలో శనివారం భక్తుల రద్దీ పెరిగింది. దర్శనం కోసం భక్తులు వేచి ఉండే వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లో 22 కంపార్ట్‌మెంట్లు నిండాయి.

సాయంత్రం 6 గంటలకు అందిన సమాచారం :

గదుల వివరాలు:

ఉచిత గదులు – ఖాళీ లేవు
రూ.50 గదులు – ఖాళీ లేవు
రూ.100 గదులు – ఖాళీ లేవు
రూ.500 గదులు – ఖాళీ లేవు

సేవలు

సహస్ర దీపాలంకరణ – ఖాళీ లేవు
వసంతోత్సవం – ఖాళీ లేవు
ఆర్జిత బ్రహ్మోత్సవం – ఖాళీ లేవు

చెన్నైలో ఆంధ్రా ఎస్సీ,ఎస్టీ పట్టభద్రులకు సన్మానం



ఉరవకొండరూరల్: అంతర్జాతీయ దళిత ఆఫ్రికన్ గిరిజన పట్టభద్రుల దినోత్సవంలో పాల్గొన్న అనంత జిల్లా వాసులును బంగారు పతకం, ధృవీకరణ పత్రాలతో సన్మానించారు. శనివారం చెన్నైలో డాక్టర్ ఎంజీఆర్ జానకీ కాలేజ్ ఆఫ్ఆర్ట్ అండ్ సైన్స్ ఫర్ ఉమెన్స్ కళాశాలలో తుడి అనే స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో అంతర్జాతీయ దళిత, ఆఫ్రికన్ ,గిరిజన పట్టభద్రుల దినోత్సవం నిర్వహించారు. ఇక్కడ జపాన్, జర్మనీ, ఆఫ్రికా దేశాలతోపాటు ఇతర రాష్ట్రాల పట్టభద్రులు దాదాపు వేలాది మంది హాజరయ్యారు. కమల్ నాయక్ మాట్లాడుతూ జిల్లాలోని ఎస్సీ,ఎస్టీ పేద విద్యార్థుల్లో ప్రతిభావంతులను గుర్తించి కలెక్టర్ వీరపాండియన్, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ రోశన్న ,లక్ష్మానాయక్ తనను చెన్నైకు పంపడం ఆనందంగా ఉందన్నారు. ఈ అవార్డుకు ఎంపిక అయినందుకు చాలా సంతోషంగా ఉందని, వారి ప్రోత్సాహం మరువలేదని అభినందనలు తెలియజేశారు.

వాతావరణం

రానున్న 24 గంటల్లో అండమాన్ అండ్ నికోబార్ దీవుల్లో ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది. ఉత్తర, వాయువ్య, తూర్పు, ఈశాన్య రాష్ట్రాల్లో దట్టమైన పొగమంచు కమ్ముకుంటుంది. ఉత్తరప్రదేశ్, బిహార్‌ల్లోని ఉత్తర ప్రాంతాల్లో చలి పెరగనుంది. దేశంలోని వాయువ్య ప్రాంతంతోపాటు తూర్పు మధ్యప్రదేశ్‌లో చలి గాలులు వీచే అవకాశం ఉంది.

అనంతపురం వాతావరణం

గరిష్టం కనిష్టం
30.8°/15.0°

జాతీయం

నగరం	గరిష్ట	కనిష్ట
ఢిల్లీ	20.8	04.2
కోల్‌కతా	23.4	11.6
బెంగళూరు	27.2	14.7
ముంబై	29.6	15.7
చెన్నై	29.1	20.0

పట్టణ వాతావరణం

పట్టణం/జిల్లా	గరిష్ట/కనిష్ట	పట్టణం/జిల్లా	గరిష్ట/కనిష్ట
నెల్లూరు	31.0/20.5	రాజమండ్రి	29.9/18.2
కర్నూలు	31.0/17.5	తాడేపల్లిగూడెం	29.9/18.2
అనంతపురం	30.8/15.0	చిత్తూరు	29.8/15.8
ఒంగోలు	30.6/20.1	తిరుపతి	29.8/15.8
మహబూబ్‌నగర్	30.6/16.1	విజయవాడ	29.7/17.0
నిజామాబాద్	30.6/14.4	హైదరాబాద్	29.6/13.1
మెదక్	30.5/10.3	రంగారెడ్డి	29.6/13.1
గుంటూరు	30.4/15.4	వరంగల్	29.3/12.0
కడప	30.3/16.0	నల్లగొండ	29.1/15.4
ఖమ్మం	30.2/09.4	కాకినాడ	29.0/18.5
ఆదిలాబాద్	30.2/07.4	శ్రీకాకుళం	28.8/14.4
కరీంనగర్	30.0/11.2	విజయనగరం	28.8/14.4
ఏలూరు	29.9/18.2	విశాఖపట్నం	28.7/18.5

బుల్లితెర

www.sakshi.com

సాక్షి SAKSHI TV

ఉ. 07.00 గంటల నుండి ప్రతి గంటకు సాక్షి న్యూస్ బులెటిన్

ఉ.06.30 సత్యవాక్యం
ఉ.07.00 న్యూస్ 360
ఉ.07.30 కేఎస్ఆర్ లైవ్ షో
ఉ.08.30 సరదాగా కాసేపు
ఉ.09.30 జ్యూక్ బాక్స్
ఉ.10.00 సాక్షి న్యూస్
ఉ.11.30 సదరన్ స్పైస్
మ.12.30 ప్రాపర్టీ ప్లస్
మ.02.30 న్యూస్ ఫీచర్
సా.04.30 కొత్త ప్రపంచం
సా.05.00 స్పీడ్ న్యూస్
సా.05.30 జనపథం
సా.06.00 రీజనల్ న్యూస్
సా.06.30 న్యూస్ ఫీచర్
రా.07.30 స్టార్ స్టార్
రా.08.00 మనసులో మాట
రా.09.00 న్యూస్ 360

టీవీలో ఈరోజు సినిమాలు




జెమిని మూవీస్
ఉ.07.00 బోస్
ఉ.09.30 జగపతి
మ.12.00 అపరిచితుడు
మ.03.00 కత్తి కాంతారావు
రా.09.00 ఛాలెంజ్




మూవీస్ నౌ
ఉ.06.45 ద రాత్ ఆఫ్ వజ్రా
ఉ.09.00 క్లాష్ ఆఫ్ ద టైటన్స్
ఉ.11.00 ద జంగిల్ బుక్
సా.04.15 రష్ అవర్ 2
సా.06.05 ద అవెంజర్స్




హెచ్‌బీవో
ఉ.06.00 లైసెన్స్ టు వెడ్
ఉ.07.27 గ్రీన్ లాంతర్న్
ఉ.09.30 స్టోర్క్స్
మ.12.42 300
సా.06.56 వార్ డాగ్స్



స్టార్ మూవీస్
ఉ.06.11 పిక్సెల్స్
ఉ.08.04 ద ఇంక్రెడిబుల్స్
ఉ.10.23 కార్స్
మ.12.43 టర్బో
సా.04.42 ఫ్రోజెన్



మా మూవీస్
ఉ.07.00 నిర్ణయం
ఉ.09.00 లీడర్
మ.12.00 సీమటపాకాయ్
సా.06.00 పసివాడి ప్రాణం
రా.09.00 అశోక్



జీ సినిమా
ఉ.04.45 బ్లాక్ అండ్ వైట్
ఉ.10.11 చెన్నై ఎక్స్‌ప్రెస్
మ.01.08 హమ్ ఆప్ కే హై కౌన్
సా.05.27 కమాండో 2
రా.08.00 ఏక్ రిష్తా:ద బాండ్ ఆఫ్ లవ్

రిపోర్టర్ల ఫోన్ నెంబర్లు :
అనంతపురం న్యూసిటీ- బాలకృష్ణారావు : 9885656873
అనంతపురం అర్బన్- విజయభాస్కర్ : 9010312451
అనంతపురం సిటీ - మంజునాథ్ : 9441888612
అనంతపురం సెంట్రల్- రమణారెడ్డి : 8885845631
అనంతపురం ఎడ్యుకేషన్- నగేష్ : 9010756716
అనంతపురం అగ్రికల్చర్- రామలింగారెడ్డి : 9010310799
అనంతపురం కల్చరల్- మురళీకృష్ణ :9010748990
అనంతపురం రూరల్- సంగప్ప : 9703878799



హామీలు నెరవేర్చమంటే బెదిరింపులా?

- చంద్రబాబుకు మత్స్యకారులంటే చిన్నచూపెందుకు
- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి, మాజీ మేయర్ రాగే పరుశురాం



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రాగే పరుశురాం, నాయకులు

అనంతపురం: మత్స్యకారులంటే ప్రభుత్వానికి చాలా అలుసుగా ఉందని, వారి పట్ల చిన్నచూపు చూస్తూ సీఎం చంద్రబాబు మాట్లాడిన తీరు సిగ్గుచేటుగా ఉందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రాగే పరుశురాం అన్నారు. విశాఖ జిల్లాలో శాంతియుతంగా రిలే దీక్షలు చేస్తున్న మత్స్యకారుల పట్ల సీఎం చేసిన వ్యాఖ్యలను ఆయన తీవ్రంగా ఖండించారు. స్థానిక ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. శిబిరం ఎత్తివేయకపోతే తోలుతీస్తా అంటూ సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించడం.. బీసీల పట్ల ఆయనకు చిత్తశుద్ధి లేదనేందుకు నిదర్శనమని అన్నారు. రాష్ట్ర ప్రతిపక్ష నేత వైఎస్.జగన్‌మోహన్ రెడ్డి చేపట్టిన మహా సంకల్పయాత్రకు ప్రజల ఆదరణ చూసిన సీఎం.. తన పదవికి ముప్పు వాటిల్లుతుందనే అభద్రత భావానికి లోనవుతున్నారని, అందుకే ఇలాంటి చవకబారు బెదిరింపులకు దిగుతున్నారని ఎద్దేవా చేశారు. ఎన్నికల మేనిఫెస్టోలో బీసీలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, లేకుంటే రాబోవు ఎన్నికల్లో బీసీలే ఆయన తోలు తీసేందుకు సిద్ధమవుతారని హెచ్చరించారు. జగన్‌ను బలపరిచేందుకు బీసీల్లో చైతన్యం తీసుకువస్తామని అన్నారు. రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మీసాల రంగన్న, సాంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షులు రిలాక్స్ నాగరాజు, మహిళా విభాగం నగర అధ్యక్షురాలు కృష్ణవేణి, నాయకులు మారుతీప్రకాష్, బిల్లే మంజునాథ్, బండి గిరి, రమేష్, ఆలుమూరు రవి, గోగుల పుల్లయ్య పాల్గొన్నారు.

43 క్వింటాళ్ల చౌకబియ్యం పట్టివేత

అనంతపురం సెంట్రల్: ఉరవకొండ మండలంలోని వెలుగొండ రోడ్డులో ఉన్న బొరుగుల బట్టీలో అక్రమంగా నిల్వ ఉంచిన 43 క్వింటాళ్ల చౌక బియ్యాన్ని శనివారం విజిలెన్స్ అధికారులు సీజ్ చేశారు. నిత్యవసర వస్తువుల చట్టం–1955 కింద బట్టీ నిర్వాహకునిపై కేసు నమోదు చేసి బియ్యంతో పాటు, వేయింగ్ మిషన్, స్టిచ్చింగ్ పరికరాలను సీజ్ చేసినట్లు వెల్లడించారు. దాడుల్లో విజిలెన్స్ ఎస్‌ఐ రామకృష్ణయ్య, ఏజీ శివప్రసాద్, స్థానిక రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

25 మంది ఈవ్‌టీజర్లకు కౌన్సెలింగ్

అనంతపురం సెంట్రల్: అమ్మాయిలను వేధించే 25 మంది పోకిరీలకు శనివారం పోలీసులు కౌన్సెలింగ్ నిర్వహించారు. జిల్లా ఎస్పీ జీవీజీ అశోక్‌కుమార్ ఆదేశాల మేరకు పలు ప్రాంతాల్లో నిఘా ఉంచిన మహిళా రక్షక్ బృందాలు జిల్లావ్యాప్తంగా 25 మంది ఈవ్‌టీజర్లను అదుపులోకి తీసుకున్నారు. శనివారం ఆయా డీఎస్పీల కార్యాలయంలో వారికి కౌన్సెలింగ్ నిర్వహించారు. నగరంలోని మహిళా కౌన్సెలింగ్ సెంటర్‌లో డీఎస్పీ వెంకట్రావ్ ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ జరిపారు. ఈవ్‌టీజర్లతో పాటు వారి తల్లిదండ్రులను పిలిపించి భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు పునరావృతం అయితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తల్లిదండ్రులు కూడా వారి పిల్లల నడవడికలపై ఎప్పటికప్పుడు దృష్టి సారించాలని కోరారు.

షిర్డీ సాయినాథునికి నృత్య నీరాజనం



అనంతపురం కల్చరల్: షిర్డీ సాయి సంస్థానంలో జరుగుతున్న శతాబ్ది ఉత్సవాల్లో దేశవ్యాప్త కళాకారులు సాయినాథుని మహా సమాధి ఎదుట నృత్య నీరాజనాలర్పిస్తున్నారు. అందులో భాగంగా శనివారం నగరానికి చెందిన నృత్య దర్శకులు సూర్యప్రకాష్ శిష్యబృందం అద్భుత శాస్త్రీయ నృత్యాలతో ఆకట్టుకున్నారు. గజానన, కృష్ణ శబ్దం, నగుమోము నృత్యరూపకాలను ప్రదర్శించారు. సంస్థానం నిర్వాహకులు శుదాంసు మోలే, లక్ష్మణ్‌జీ తదితరులు చిన్నారులను, నృత్య దర్శకులను ఘనంగా సత్కరించి జ్ఞాపికలను అందజేశారు.

విద్యార్థుల ఆత్మహత్యలకు ప్రభుత్వానిదే బాధ్యత

- ఓసీ విద్యార్థి సంఘం డిమాండ్



ఆందోళన చేస్తున్న ఓసీ విద్యార్థి సంఘం నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: రాష్ట్రవ్యాప్తంగా విద్యాసంస్థల్లో జరుగుతున్న విద్యార్థుల ఆత్మహత్యలకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని ఓసీ విద్యార్థి సంఘం నాయకులు డిమాండ్ చేశారు. నగరంలోని కొవ్వూర్‌నగర్ నారాయణ స్కూల్‌లో చదువుతున్న 9వ తరగతి విద్యార్థి ఆత్మహత్య ఘటనను నిరసిస్తూ శనివారం సప్తగిరి సర్కిల్‌లో ఆ సంఘం నాయకులు నిరసన తెలియజేశారు. ఓసీ విద్యార్థి సంఘం నాయకులు మాట్లాడుతూ విద్యా వ్యాపారమే లక్ష్యంగా నడుపుతున్న కార్పొరేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి జయవర్ధన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షులు రాము, నాయకులు సమర సింహారెడ్డి, కార్తీక్, బసిరెడ్డి, వివేక్ రెడ్డి, చెన్నారెడ్డి, గోపికృష్ణచౌదరి పాల్గొన్నారు.

‘పచ్చదనం’లో పంచాయతీ కార్మికులు



అనంతపురం రూరల్ కక్కలపల్లికాలనీ పంచాయతీ, ఎ.నారాయణపురం మేజర్ పంచాయతీ కార్మికులను మంత్రి పరిటాల సునీత, ఆమె బంధువు పరిటాల మహేంద్ర పేరు చెప్పుకొంటున్న కొందరు చోటా నాయకులు ప్రతిసారీ తమ పనులకు, పార్టీ పనులకు ఉపయోగించుకుంటున్నారు. పంచాయతీల్లో ‘పచ్చదనం – పరిశుభ్రత’కు పాటుపడాల్సిన కార్మికులతో టీడీపీ జెండాలు, బ్యానర్లు కట్టిస్తున్నారు. తమ పంచాయతీలోని పల్లెలను స్వచ్ఛ గ్రామాలుగా ఉంచాల్సిన కార్మికులతోనే వాటిని పచ్చగ్రామాలుగా తయారు చేయిస్తున్నారు. ఇందుకు మరో నిదర్శనమే ఈ చిత్రాలు. అనంతపురం రూరల్ కక్కలపల్లికాలనీ పంచాయతీలో ఆదివారం నిర్వహిస్తున్న టీడీపీ కార్యక్రమానికి మంత్రి పరిటాల సునీత వస్తున్న సందర్భంగా ఆ పార్టీ కార్యకర్తలు ఏర్పాటు చేస్తున్న ఫ్లెక్సీలను, జెండాలను శనివారం 6 మంది పంచాయతీ కార్మికులతో కట్టించారు. స్థానిక నాయకులు దగ్గరుండి మరీ ఈ పనులు చేయించడం చర్చనీయాంశమైంది. ఇటీవల నారాయణపురం సర్పంచ్ రామలక్ష్మి చేపట్టిన సిమెంట్ రోడ్ల నిర్మాణాలకు కూడా ఇలానే కార్మికులను వాడుకున్నారు.

అలరించిన కళా ప్రదర్శన

అనంతపురం కల్చరల్: జన్మభూమి సాంస్కృతిక వేదికగా స్థానిక కృష్ణకళా మందిరంలో శనివారం రాత్రి పలు కళా విన్యాసాలు ఉత్సాహంగా సాగాయి. నటరాజ్ డాన్స్ అకాడమీ, వినాయక నృత్య కళానిలయం, జిల్లా సాంస్కృతిక మండలి కళా బృందం, కేఎస్ఆర్, క్రిస్టోస్ పాఠశాల విద్యార్థులు జానపద, సినీగీతాలపై అద్భుత ప్రతిభతో నర్తించారు. సమాచార శాఖ ఏడీ జయమ్మ, ఫక్రుద్దీన్, పీడీ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

భవిష్యత్ పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి


- ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ



ల్యాబ్‌ను పరిశీలిస్తున్న స్కిల్ డెవలప్‌మెంట్ స్టేట్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ

అనంతపురం సప్తగిరి సర్కిల్: స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారా భవిష్యత్తు పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలని ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్‌మెంట్ స్టేట్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ ఆకాంక్షించారు. శనివారం జేఎన్‌టీయూ అనంతపురంలోని మెకానికల్ విభాగంలోని సీమన్స్ సెంటర్ ఆఫ్ ఎక్సెలెన్స్ ద్వారా అభివృద్ధి పరిచిన 14 ల్యాబ్‌లను ఆయన సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థీ థియరీ చదువుకోవడంతోపాటు స్కిల్స్‌పైన అవగాహన, నైపుణ్యం పెంచుకోవాలనే ఉద్దేశంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను సీమన్స్ సెంటర్ ఆఫ్ ఎక్సెలెన్స్ ద్వారా అభివృద్ధి పరిచిందన్నారు. అనంతపురం ఇంజినీరింగ్ కళాశాలలో ఇప్పటి వరకు 49 బ్యాచులు 1750 మంది విద్యార్థులకు శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. యూనివర్శిటీ పరిశ్రమలలో మెమొరాండం ఆఫ్ అండర్‌స్టాండ్ (ఎంఓయూ)లు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జేఎన్‌టీయూ వీసీ శ్రీనివాసకుమార్, రిజిస్ట్రార్ కృష్ణయ్య, ప్రిన్సిపాల్ ప్రహ్లాదరావు, మెకానికల్ హెచ్‌ఓడీ దుర్గాప్రసాద్, మెకానికల్, ఈఈఈ అధ్యాపకులు, పీఆర్‌ఓ అంకారావు పాల్గొన్నారు.

మరిన్ని జోన్ వార్తలు 12లో



తెలుగు సాహిత్యంలోని పలు ప్రక్రియలు కలబోస్తే ఆయన కలంగా మారుతుంది. ఆయన కవితల్లో సీమ వాసులతో మమేకమైన కరువు కనిపిస్తుంది... కథల్లో మనిషిలో అంతర్లీనంగా ఉండే భావాలు వ్యక్తమవుతాయి. కవిగా..కథకునిగా..నవలా రచయితగా.. నటుడిగా.. దర్శకునిగా అన్నిటిని మించి క్రమశిక్షణ కల్గిన పోలీసు అధికారిగా బహుముఖ ప్రజ్ఞతో అనంత సాహిహిత్య రథ సారథులలో ఒకరుగా రాణిస్తున్న బాలగొండ ఆంజనేయులుతో 'సాక్షి మార్నింగ్ వాక్ హృదయరాగం' మీ కోసం.. – అనంతపురం కల్చరల్

కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం ఆంజనేయులు

రచయితల సూచనలతో ఒరవడి మారింది



నేను చదువుకునే రోజుల్లో సింగమనేని నారాయణ గారు మాకు తెలుగు టీచర్‌గా ఉండే వారు. నేను రచయితగా స్థిరపడ తున్న తరుణంలో కేతు బుచ్చిరెడ్డి నాకు సాహితీ గురువుగా ఎన్నో పాఠాలు నేర్పారు. అలాగే డాక్టర్ శాంతి నారాయణ, రాచ పాలెం చంద్రశేఖరరెడ్డి, చిలుకూరు దేవపుత్ర కలిసినప్పుడల్లా నన్ను కవితా ప్రస్థానం నుంచి కథకు మారాలని సూచన లిచ్చారు. వారి ప్రేరణతోనే నేను అనేక కథలు రాశాను. ప్రతి దాంట్లో అనంత జీవన నేపథ్యమే ఉండేలా చూసుకున్నాను. నా కథలు చదివిన ఇతర ప్రాంతాలకు చెందిన వారు ఇక్కడి ప్రదేశాల గురించి ఆసక్తిగా అడిగినప్పుడు ఎంతో ఆనందమనిపించేది. అందరి ఆశీస్సులతోనే నాకు ఆంధ్రరత్నం, ఉగాది పురస్కారంతో పాటు సన్మానాలు, సత్కారాలు దక్కాయి.

సైరిక.. సైనిక

భూమి తల్లిని కాపాడేది వారిద్దరే. ఒకరు సైనికుడు, రెండు కర్షకుడు. ఎప్పటి నుంచో నాలో నాటుకుపోయిన ఈ భావమే 'సైరిక..సైనిక' పేరుతో తొలి కవితా రూపంలో వచ్చింది. ఎంత పని ఒత్తిడి ఉన్నా.. సాహిత్యంతో గడిపే క్షణాలే ఆనందాన్ని మిగుల్చుతున్నాయి. నేను రాసిన ప్రతి కథలోనూ మనిషిలో సహజంగా ఉండే మానసిక సంఘర్షణనే కథా వస్తువుగా తీసుకున్నా. ముఖ్యంగా ఎస్పీ సజ్జనార్ కోరిక మేరకు మార్గదర్శి అనే పుస్తకాన్ని రాశాను. కొన్ని వందల మందికి అది ఉపయోగపడింది.

బయోడేటా

పూర్తిపేరు	: బాలగొండ ఆంజనేయులు
జన్మస్థలం	: చెన్నేకొత్తపల్లి మండలం, బసినేపల్లి గ్రామం
పుట్టిన తేదీ	: 01-07-1957
తల్లిదండ్రులు	: కుళ్లాయప్ప, పాపమ్మ
భార్య	: కాంతమ్మ
సంతానం	: మహేష్‌బాబు (కొడుకు), శ్రావణి (కూతురు)
విద్య	: బీకాం., బీఎల్.,
వృత్తి	: పోలీస్ శాఖలో అడ్మినిస్ట్రేటివ్ అధికారిగా ఉద్యోగ విరమణ
రచనలు	: తొలకరి చినుకులు (గేయ సంపుటి), తిమ్మమాంబ (చారిత్రక నవల), 'మొగ్గల్లడ' (కథల సంపుటి), అందాలు - భవబంధాలు (సాంఘిక), శివరావణ యుద్ధం (పౌరాణిక నవల)
రచనా స్ఫూర్తి	: కేతు బుచ్చిరెడ్డి

బాల్యంలోనే కవితా ఛాయలు

చదువుకునే రోజుల్లోనే కవితలు రాసేవాడిని. బసినేపల్లి గ్రామంలో ప్రాథమిక విద్యాభ్యాసం, చెన్నేకొత్తపల్లి, ధర్మవరంలో ఇంటర్, ఆర్ట్స్ కళాశాలలో డిగ్రీ పూర్తి చేశాను. వెనువెంటనే సర్వీసు కమిషన్ పరీక్ష ఉత్తీర్ణతతో ఉద్యోగంలో చేరాను. ఒకేసారి గ్రామీణ బ్యాంకులో, పోలీసు శాఖలో ఉద్యోగ అవకాశాలొచ్చాయి. నేను పోలీసు శాఖనే ఎంచుకున్నాను. తొలిరోజుల్లో కవితా ప్రస్థానానికి ఫుల్‌స్టాప్ పడిందనే అనుకున్నా.

అనంత ప్రచారమే లక్ష్యంగా



అనంత ఖ్యాతిని చాటడానికి 'తిమ్మమాంబ మర్రిమాను చరిత్ర'ను రాశాను. ఓ నిర్మాత దానిని 'సతీ తిమ్మమాంబ' పేరుతో సినిమా తీయడమే కాక దానికి కథ, సంభాషణలు, స్క్రీన్‌ప్లే, దర్శకత్వ బాధ్యతలు కూడా నాకే అప్పగించారు. అందులో ఓ మంచి పాత్రలో నేను నటించాను. ముఖ్యంగా ఆ నవల హాట్ కేకుల్లా అమ్ముడుపోయింది. దీంతో వెనువెంటనే ద్వితీయ ముద్రణ చేయాల్సి వచ్చింది.

తెలుగు భాషకు పట్టం కట్టాలి

మాతృభాషకు ఇంకా నాలుగు నూకలున్నాయంటే రచయితలు, కవులు, పత్రికలే కారణం. స్కూళ్లల్లో ఏనాడో తెలుగుకు తెగులు పట్టించేశారు. అవ్వతాతలు ఒళ్లో కూర్చుండబెట్టుకుని వేమన, సుమతీ పద్యాలు చెప్పించబట్టే జీవితంలో ఎలా ఉండాలో నేర్చుకునే వాళ్లు. మేము నలుగురు సంతానం. అమ్మనాన్నలు పూర్తిగా నిరక్షరాస్యులు. ఒకరకంగా చెప్పాలంటే పూర్వపు పెద్దలు వ్యక్తిత్వ వికాస నిపుణులే. ఆ ఓపిక, తీరిక ఇప్పుడెక్కడుంది?

అనంత కవిత్వానికి పట్టాభిషేకం

అనంతలో సాహిత్యాన్ని ఎందరో కారణజన్ములు సుసంపన్నం చేశారు. కాల క్రమంలో కవితా, కథ అంటే సినిమాలే అన్న భావన పాతుకుపోయిన తరుణంలో అనంత అంటే ఏమిటో అంతర్జాతీయం స్థాయిలో గుర్తింపు వచ్చేలా తెలుగు రక్షణ వేదిక అధ్యక్షులు హరికృష్ణతో కలిసి ప్రపంచ రికార్డు కవితా ఉత్సవాన్ని జిల్లా వేదికగా నిర్వహించాం. కవితోత్సవంలో వందల సంఖ్యలో కవులు తమ గళాన్ని వినిపించడమే కాక అనంత వాస్తవ రూపాన్ని తెలుసుకున్నారు.

డీజీపీలతో అనుబంధం

నేను చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా హైదరాబాదులో పనిచేశాను. చాలా మందికి ఒకటి రెండు ఏళ్లకు మించి ఆ హోదా ఉండదు. కానీ నేను ఎనిమిదేళ్లు అదే క్యాడర్‌లో పనిచేశాను. ముఖ్యంగా ఇక్కడి ప్రాంతం వారైన డీజీపీలు రొద్దం ప్రభాకరరావు, అరవిందరావు, జేవీ రాముడు, ఏకే ఖాన్ తదితరులందరూ నా పట్ల ప్రత్యేక అభిమానం చూపించేవారు. తిమ్మమాంబ చరిత్ర పుస్తకాన్ని అనంతలో ఆవిష్కరించినపుడు ఏకే ఖాన్ ఆత్మీయ అతిథిగా విచ్చేసి పాల్గొన్నారు.

రాయలసీమ కళావాహిని ఏర్పాటు

రాష్ట్ర విభజనతో అన్ని రంగాల్లో వివక్ష స్పష్టంగా కనిపిస్తోంది. హైదరాబాదులో అనంత కళాకారులకు విలువ లేకుండా పోయింది. ఇక్కడి రచయితలకు అక్కడ పని దొరకడం లేదు. చాలా ఏళ్ల తరబడి వారసత్వ కుటుంబాలుగా స్థిరపడిన కోస్తా వారు కొంత మేర ఈ వివక్షను తట్టుకోగలిగినా రాయలసీమ వారికి పూర్తిగా అన్యాయం జరుగుతోంది. దీనిని అడ్డుకట్ట వేసేందుకు సినీ ప్రముఖులతో కలిసి రాయలసీమ కళావాహిని పేరుతో కొత్త సంస్థను ఈ నెలలోనే ప్రారంభించబోతున్నాం. అనంత వేదికగా తొలి సభ జరుగుతుంది. అలాగే ఔత్సాహిక రచయితలకు కొత్త ఉత్సాహాన్ని ఇచ్చే కార్యక్రమాల ప్రణాళిక కూడా ఉంటుంది.

'శివరావణ యుద్ధం' గురించి..

నేను రాసిన మరో పుస్తకం 'శివరావణ యుద్ధం' త్వరలో రాబోతోంది. పురాణ ఇతిహాసాలలో లేని కొత్త విషయాన్ని ఇందులో పరిచయం చేయబోతున్నాను. రావణుడు శివునితో చేసే యుద్ధమనేది సందేశాత్మకంగా ఉంటుంది. కథ, కథనం కొత్తగా ఉందని కొమ్మనాపల్లి గణపతిరావు వంటి పలువురు సమీక్షకులు అభిప్రాయపడ్డారు. అనంతలోనే అందాలు– భవబంధాలు అనే నా నవలను సినిమాగా తీయడానికి ప్రయత్నిస్తున్నాను.

నదుల అనుసంధానంతోనే మనుగడ

జిల్లాలో సాగుకే కాదు తాగేందుకూ నీళ్లు లేవు. ఇలాగే కొనసాగితే నీటి చుక్కను బొమ్మల్లో చూడాల్సి వస్తుందేమో! ప్రకృతి కరుణించనప్పుడు మానవ ప్రయత్నం గట్టిగా ఉండాలి. అయితే అది కూడా అంతంత మాత్రంగానే ఉండడం వల్లనే కరువు కరాళ నృత్యం చేస్తోందిక్కడ. దీనికంతటికీ పరిష్కారం నదుల అనుసంధానమే. ఒక్క నీటి సమస్యను పరిష్కరించుకోగలిగితే అనంతను మించిన సురక్షిత ప్రాంతం మరొకటి ఉండదు. కరువును ప్రతిబింబిస్తూ నేను రాసిన 'ముళ్లదారి' కథకు చాలా స్పందన వచ్చింది.


కుటుంబ సభ్యులతో బాలగొండ ఆంజనేయులు

జన్మభూమి ఉక్కిరిబిక్కిరి

అనంతపురం అర్బన్:

ప్రజాసమస్యలు పరిష్కరించామంటూ ప్రభుత్వము, ప్రజాప్రతినిధులు చెబుతున్న మాటల్లోని డొల్లతనాన్ని జిల్లావ్యాప్తంగా నిర్వహిస్తున్న జన్మభూమి గ్రామసభలు తేటతెల్లం చేస్తున్నాయి. శనివారం జన్మభూమి సభల్లోనూ ప్రజలు అధికారులను, ప్రజాప్రతినిధులను నిలదీశారు.



గ్రామసభ నుంచి లబ్ధిదారులను తోసేస్తున్న టీడీపీ నాయకులు



రాయదుర్గం 15వ వార్డులో మంత్రిని చుట్టుముట్టిన మహిళలు

- సమస్యల పరిష్కారానికి నిలదీతలు
- పెడబల్లిలో కార్మిక నేతలపై టీడీపీ నాయకుల దాడి
- ఎమ్మెల్యే ఉన్నంను నిలదీసిన రైతులు

● పుట్టపర్తి అర్బన్ పరిధిలోని పెడబల్లి గ్రామసభలో కార్మికుల సమస్యలపై అర్జీ ఇచ్చేందుకు వచ్చిన భగత్‌సింగ్ ఆటో డ్రైవర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు బాబా ఫకృద్దీన్, సీపీఎం మండల కార్యదర్శి గౌస్‌లా జమ్, డివిజినల్ కార్యదర్శి లక్ష్మినారాయణలపై టీడీపీ నాయకులు దాడి చేశారు.

● కూడేరు మండలం ఉదిరిపికొండలో పింఛన్ మంజూరు చేయడం లేదంటూ అధికారుల ముందు వాపోయిన వృద్ధులను అక్కడే ఉన్న టీడీపీ నాయకులు 'మీరు వైసీపీ వాళ్లు.. మీకు మంజూరు చేసేదే లేదు' అంటూ దుర్భాషలాడారు.

● కుందుర్పి మండలం అపిలేపల్లిలో రైతులు అతావుల్లా, జయన్న, భీమప్ప తదితరులు ఇన్‌పుట్ సబ్సిడీ రాలేదని ఎమ్మెల్యే ఉన్నం హనుమంతరాయచౌదరిని నిలదీశారు.

● గత జన్మభూమి కార్యక్రమాల్లో ఇచ్చిన సమస్యలు పరిష్కరించలేదని, పేదలకు పక్కాగృహాలు, పింఛన్లు మంజూరు చేయలేదని కళ్యాణదుర్గం మునిసిపాలిటీ పరిధిలోని 14వ వార్డులో వైఎస్సార్‌సీపీ నాయకుడు బిక్కి హరి వేదిక ముందు పడుకుని నిరసన తెలిపారు.

● ఇన్‌పుట్ సబ్సిడీ కోసం గత ఏడాది ఇచ్చిన అర్జీలకు దిక్కులేదంటూ శెట్టూరు మండలం చింతర్లపల్లి జన్మభూమిలో రైతులు మల్లయ్య, లింగారెడ్డి, హనుమంతరాయుడు, తదితరులు నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు.

● ప్రజాసమస్యలు పరిష్కరించలేనప్పుడు జన్మభూమి నిర్వహించడం ఎందుకంటూ బ్రహ్మసముద్రం మండలం కొండాపురం గ్రామంలో వైఎస్సార్‌సీపీ, ఎమ్మార్పీఎస్ నాయకులు గ్రామసభను అడ్డుకున్నారు. దీంతో అధికారులు కార్యక్రమాన్ని మధ్యలోనే ముగించి వెళ్లిపోయారు.

● అర్హులకు సంక్షేమ పథకాలు అందడం లేదంటూ నల్లమడలో ప్రజలు అధికారులను నిలదీశారు. అర్హత ఉన్నా పింఛన్లు రాకుండా అడ్డుకుంటున్నారని వృద్ధులు, వితంతవులు అధికారుల వద్ద వాపోయారు. పోలీసులు జోక్యం చేసుకుని వారిని శాంతింప చేయాల్సి వచ్చింది.

● ఇంటి పట్టాలు ఇవ్వలేదంటూ వజ్రకరూర్ మండలం పందికుంటలో గ్రామస్తులు అధికారులను నిలదీశారు.

● తనకల్లు మండలం దిగువ తోటపల్లిలో ప్రజలు అధికారులను నిలదీయడంతో గ్రామసభ రసాబసగా మారింది.

పార్టీ వేదికలుగా జన్మభూమి

జన్మభూమి గ్రామసభలను అధికారపార్టీ వారు రాజకీయ వేదికలుగా మార్చేస్తున్నారు. గుంతకల్లు మునిసిపాలిటీ 14వ వార్డులో నిర్వహించిన జన్మభూమి సభలో ఎమ్మెల్యే జితేంద్రగౌడ్ కొందరు వ్యక్తులకు టీడీపీ కండువాలు కప్పి ఆహ్వానించారు. కదిరి వ్యవసాయ మార్కెట్ యార్డులో జన్మభూమి వేదికపై అక్కడి టీడీపీ ఇన్‌చార్జ్ కందికుంట దంపతులు కూర్చున్నారు.

జన్మభూమిలో రైతు ఆత్మహత్యాయత్నం



పురుగుల మందు తాగేందుకు యత్నిస్తున్న రైతు ఆంజనేయులు

కూడేరు: మండల పరిధిలోని ఉదిరిపికొండలో శనివారం 'జన్మభూమి – మా ఊరు' కార్యక్రమంలో శివరాంపేటకు చెందిన రైతు ఆంజనేయులు పురుగులమందు తాగేందుకు ప్రయత్నించారు. వెంటనే పోలీసులు, ప్రజలు ఆ డబ్బా లాగేసుకున్నారు. మండల ప్రత్యేకాధికారి కోదండ రాములు ఆ రైతుతో మాట్లాడుతూ సమస్య ఏమిటని అడగడంతో ఆయన కన్నీరు పెట్టుకున్నారు. కొన్నేళ్ల నుంచి తాము ముగ్గురు అన్నదమ్ములం 10 ఎకరాల భూమిని సాగు చేసుకుంటుండగా, రెవెన్యూ అధికారులు తన సోదరుడు శివయ్య వద్ద డబ్బులు తీసుకుని ఏడున్నర ఎకరాకు అతనికి పట్టా ఇచ్చారని ఆవేదన వ్యక్తం చేశారు. తనకు న్యాయం చేయాలని తహశీల్దార్‌కు అనేకమార్లు విన్నవించుకున్నా స్పందించలేదని వాపోయారు. తమకు న్యాయం చేసేవరకూ ఇక్కడి నుంచి కదలబోమని బాధిత రైతు, ఆయన తరపు వ్యక్తులు తహశీల్దార్‌ను నిలదీశారు. దానికామె బాగా చేస్తామంటూ వ్యంగ్యంగా దీర్ఘాలు తీశారు. ఆమె తీరుపై అక్కడి ప్రజలు మండిపడ్డారు. చివరికి శివయ్యకు పట్టా ఇవ్వడంలో పొరపాటు జరిగిందని, న్యాయం చేస్తామని ఆమె చెప్పడంతో సమస్య సర్దుమణిగింది.

ప్రజలే బాబు తాట తీస్తారు

● ఎమ్మెల్సీ వెన్నపూస గోపాల్‌రెడ్డి

అనంతపురం: అన్ని విధాలా జనాన్ని మోసం చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడి తాట 2019 ఎన్నికల్లో ప్రజలే తీస్తారని ఎమ్మెల్సీ వెన్నపూస గోపాల్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. 2014 ఎన్నికల్లో మత్స్యకారులను ఎస్టీలలో చేరుస్తానని చెప్పిన చంద్రబాబు ఈరోజు మాట తప్పారన్నారు. హామీ నెరవేర్చాలని కోరుతూ నిరసన తెలియజేస్తున్న మత్స్యకారులను బ్లాక్‌మెయిల్ చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. 'నిరసన శిబిరం ఎత్తివేయకపోతే ఖబడ్దార్ అని, తాట తీస్తా, తోలు తీస్తా' అంటూ బెదిరించడం చూస్తుంటే బీసీలపై సీఎంకు ఉన్న ప్రేమ ఏపాటిదో అర్థమవుతోందన్నారు. ఆయన వాలకం చూస్తుంటే రాష్ట్రంలో ఏ కులం వారూ నిరసన తెలియజేయడానికి వీలు లేదన్నట్లుగా ఉందన్నారు. జన్మభూమి పేరుతో బోగస్ కార్యక్రమం పెట్టి జనాలను మోసం చేస్తున్నారేగానీ ఏ ఒక్కరికీ పింఛన్, రేషన్‌కార్డు, ఇంటిపట్టాలు, ఇల్లు ఇచ్చిన దాఖలాలు లేవన్నారు. అధికారుల పని గంటలను వృథా చేస్తున్నారే తప్ప ఒరగబెట్టిందేమీ లేదన్నారు.

ప్రజాప్రతినిధులకు, అధికారులకు విలువలు లేకుండాపోయాయి

బెళుగుప్ప: జన్మభూమి గ్రామసభల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు ఏమాత్రం విలువలు లేకుండా వ్యవహరిస్తున్నారని ఉరవకొండ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి విచారం వ్యక్తం చేశారు. ఆయన శనివారం బెళుగుప్ప మండల పరిధిలోని గంగవరం గ్రామంలో పార్టీ శ్రేణులు, అభిమానులతో కలిసి రచ్చబండ – పల్లెనిద్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. జన్మభూమి గ్రామసభలు కేవలం టీడీపీ కార్యక్రమాలుగా కొనసాగుతున్నాయని, జనమే ఉండటం లేదని విమర్శించారు. జన్మభూమి కమిటీ సభ్యుల పెత్తనం నచ్చక కొందరు టీడీపీ ప్రజాప్రతినిధులే సభలను బహిష్కరిస్తున్నారని చెప్పారు. అధికారులు కూడా జన్మభూమి కమిటీ సభ్యుల పెత్తనంతో విసుగెత్తిపోయారన్నారు. సమస్యలు విన్నవిద్దామని వచ్చిన పేదలపై రాజకీయ ముద్ర వేస్తూ పథకాలకు దూరం చేస్తున్నారని విచారం వెలిబుచ్చారు. మొత్తం జన్మభూమి గ్రామసభల్లో లక్షల సంఖ్యలో అర్జీలు వచ్చినా వాటిని పరిష్కరించలేదన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో కనీస మౌలిక వసతుల్లో భాగంగా ఇళ్ల నిర్మాణాల కోసం వేలాది ఎకరాలను కొనుగోలు చేసి ఉంచినా ఈ ప్రభుత్వం ఇంటి పట్టాలు ఇవ్వలేదన్నారు. భూసేకరణ చట్టాన్నే తుంగలో తొక్కి పేదల కడుపు కొడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం పేదలను పట్టించుకోకపోవడం వల్లే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంకల్ప యాత్ర చేపట్టారన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి

బెళుగుప్ప మండలంలోని జీడిపల్లి పునరావాసం విషయాన్ని అసెంబ్లీ దృష్టికి తీసుకుపోగా వచ్చే జూన్ నాటికి ఆ ప్రక్రియను పూర్తి చేస్తామన్నారని, ఆ హామీని నిలబెట్టుకోవాలని అన్నారు. ఆయనతోపాటు వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి వీరన్న, రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి దుద్దేకుంట రామాంజినేయులు తదితరులు ఉన్నారు.

ఆర్థికేతర సమస్యలను 11లోగా పరిష్కరించాలి

అనంతపురం అర్బన్: ప్రజల నుంచి అందిన అర్జీల్లో ఆర్థికేతర సమస్యలను ఈ నెల 11వ తేదీలోగా పరిష్కరించాలని అధికారులను కలెక్టర్ జి.వీరపాండియన్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవన్‌లో శనివారం ఫిర్యాదుల పరిష్కారం, మరుగుదొడ్ల నిర్మాణం, సీఎం పర్యటన ఏర్పాట్లపై సమీక్షించారు. జిల్లాలో సమస్యలు ఎక్కువగా ఉన్నాయని, వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. పంచాయతీరాజ్, రెవెన్యూ, పోలీసు శాఖలకు సంబంధించిన అర్జీలు అధికంగా పెండింగ్‌లో ఉన్నాయన్నారు. రోజుకు 4,800 మరుగుదొడ్లు నిర్మిస్తేనే లక్ష్యాలను పూర్తి చేయగలమన్నారు.

11న ముఖ్యమంత్రి పర్యటన

ముఖ్యమంత్రి పర్యటన ఈనెల 11వ తేదీ పుట్టపర్తి, బుక్కపట్నం చెరువు మీదుగా కొత్తచెరువు, ధర్మవరంలో ఉంటుందన్నారు. పర్యటన విజయవంతం అయ్యేలా ఏర్పాట్లు పక్కగా ఉండాలన్నారు. అన్ని శాఖలు స్టాళ్లు ఏర్పాటు చేయాలన్నారు.

పదిలో ప్రతి ఒక్కరూ ఉత్తీర్ణులవ్వాలి

మునిసిపల్ రీజినల్ డైరెక్టర్ రవీంద్రబాబు

రాయదుర్గం అర్బన్: పదో తరగతిలో ప్రతి ఒక్కరూ ఉత్తీర్ణులయ్యేలా ప్రధానోపాధ్యాయులు కృషి చేయాలని మునిసిపల్ రీజినల్ డైరెక్టర్ రవీంద్రబాబు అన్నారు. శనివారం సాయంత్రం రాయదుర్గం మునిసిపల్ కమిషనర్ చాంబర్‌లో మునిసిపల్ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో ఆయన పదో తరగతి విద్యార్థులకు సంబంధించి సమీక్ష నిర్వహించారు. విద్యార్థుల వివరాలు, పదికి పది పాయింట్లు సాధించగల వారు ఎవరు, ఎంతమంది ఉత్తీర్ణులవుతారు అనే విషయాలపై చర్చించారు. ప్రతి విద్యార్థినీ దత్తత తీసుకుని వారు పదిలో ఉత్తీర్ణత అయ్యేలా చూడాలన్నారు. అభ్యుదయ మోడల్ స్కూల్లో తెలుగు, హిందీ, ఇంగ్లిష్, బయాలజీ సబ్జెక్టులకు టీచర్లు లేరని, ఇటీవల వాలంటీర్లను ఏర్పాటు చేసుకున్నామని పాఠశాల టీచర్ విజయలక్ష్మి తెలిపారు. 30 మందిలో 8 మంది ఉత్తీర్ణులు కాకపోవచ్చన్నారు. రాజీవ్‌గాంధీ ఉర్దూ స్కూలులో లెక్కల సబ్జెక్టుకు టీచర్ లేరని, 8 మంది దాకా విద్యార్థులు ఉత్తీర్ణత సాధించకపోవచ్చని పాఠశాల ఉపాధ్యాయులు నిజాముద్దీన్ తెలిపారు.



మునిసిపల్ కార్యాలయంలో హెచ్‌ఎంలతో సమావేశమైన ఆర్డీ రవీంద్రబాబు

ఆర్డీ రవీంద్రబాబు మాట్లాడుతూ ప్రతి సబ్జెక్టులోనూ విద్యార్థులను మెరుగుపర్చాలన్నారు. పదికి పది పాయింట్లు సాధించే వారితోపాటు ప్రతి ఒక్కరూ ఉత్తీర్ణులయ్యేలా శ్రద్ధ తీసుకునే విషయమై టీచర్లతో కూడా చర్చించాలని సూచించారు. ఈ సమావేశంలో హెచ్‌ఎంలు ఆదినారాయణ, ఉమాపతి, రవికుమార్, కో–ఆర్డినేటర్ రమేష్, ఉపాధ్యాయులు విజయలక్ష్మి, నిజాముద్దీన్ తెలిపారు.

నేడు గుంతకల్లులో 5కే రన్

అనంతపురం సప్తగిరి సర్కిల్: జన్మభూమి – మా ఊరు కార్యక్రమంలో భాగంగా గుంతకల్లు పట్టణంలో 5కే రన్ నిర్వహించనున్నారు. ఆదివారం ఉదయం 6.30 గంటల నుంచి 7.30 గంటల వరకు సాగే ఈ రన్ రైల్వే గ్రౌండ్ నుంచి ఎన్టీఆర్ స్టేడియం, గుత్తి రోడ్డు, సరస్వతి విద్యా మందిరం, రాయల్ సర్కిల్, అజంతా సర్కిల్, ఎన్టీఆర్ విగ్రహం మీదుగా రైల్వే గ్రౌండ్‌కు చేరుతుందని డీఎస్‌డీఓ బాషామోహిద్దీన్ తెలిపారు. దీనిని విజయవంతం చేసేందుకు జిల్లాలోని క్రీడాకారులు, క్రీడా సంఘాల ప్రతినిధులు పెద్ద ఎత్తున హాజరవ్వాలని ఆయన పిలుపునిచ్చారు.

ప్రజా సంకల్ప యాత్ర

Praja Sankalpa Yaatra

సంకల్పసిద్ధిరస్తు


కల్లూరు శివారులో జగన్‌ను ఆశీర్వదిస్తున్న వేదపండితులు

ఇబ్బందుల పాలు కావొద్దు


పాడిరైతు కష్టం తెలుసుకుంటూ..

మామయ్య దీవెన


శ్రీనివాసపురంలో చిన్నారిని ఆప్యాయంగా ఎత్తుకుని ముద్దాడుతున్న జగన్‌మోహన్‌రెడ్డి

కదిలిన జగన్ దండు


సంకల్పయాత్రలో మేము సైతం అంటూ..

నీ సంకల్పానికి రైట్..రైట్


కల్లూరు శివారులో జగన్‌తో ఆర్టీసీ డ్రైవర్ కరచాలనం

• నీ రాక కోసం


ఎదురు చూపు : వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాక కోసం

• కేరింత


యువజోరు : కల్లూరులో జగనన్నకు హాయ్

• అదిగో రాజన్న బిడ్డ


ఆనందకేళి : మిద్దెపై నుంచి జననేతన



సంకల్పానికి సలాం


ముస్లింలనుద్దేశించి ప్రసంగిస్తున్న జననేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి


ప్రగతి రథానికి బాసట : ఆడపడుచుల తోడుగా..


పెల్లుబికిన ఆగ్రహం : పరీక్షలు నిర్వహించలేదని జననేతతో కలిసి ప్లకార్డులు ప్రదర్శిస్తున్న డీఎడ్ విద్యార్థినులు


విరిసిన ఆనందం : తమ అభిమాన నేత కోసం పూలు చల్లి ఎదురు చూస్తున్న అక్కాచెల్లెమ్మలు


జన తోరణం..


మా దేవుడు నువ్వు..





ు చూస్తూ..

• మళ్లీ రా అన్నా..



తీరిన ముచ్చట : తమ అభిమాన నేతకు అభివాదం చేస్తూ..

• ఆత్మీయ అభివాదం



టాటా : జననేతకు వీడ్కోలు పలుకుతూ..

చిత్తూరు జిల్లా పుంగనూరు నియోజకవర్గంలోని కల్లూరులో జరిగిన ముఖాముఖి కార్యక్రమానికి హాజరైన ముస్లింలు



శక్తినంతా కూడగట్టుకుని.. లేని సత్తువ తెచ్చుకుని.. వృద్ధాప్యాన్ని పక్కనబెట్టి.. అవ్వాతాతలు కదిలి వస్తున్నారు.. మనవడ్ని చూడాలని.. దీవెనలందించాలని.. జీవిత చరమాంకంలో పింఛను ఆసరా ఇచ్చిన రాజన్న బిడ్డకు సంఘీభావం తెలపాలని..

బాబు వస్తేనే జాబు అన్న మాటలు నమ్మి మోసపోయిన నిరుద్యోగ యువతలో ఆగ్రహం పెల్లుబుకుతోంది. కొత్తవి దేవుడెరుగు ఉన్న ఉద్యోగాలనూ ఊడబెరుకుతున్న టీడీపీ సర్కారు తీరుపై నమ్మకం పూర్తిగా సడలిపోయింది.
ఈ రాష్ట్ర సారథ్యానికి జననేత రావాలని వారంతా సంకల్పిస్తున్నారు..
అందుకే జగన్ సంకల్పయాత్రకు జై కొడుతున్నారు.

బిడ్డల్ని చదివించడానికి అష్టకష్టాలు పడుతున్న తల్లిదండ్రుల్లో 'నవరత్నాలు' కొత్త ఆశల వెలుగుల్ని నింపాయి. ఈ హామీనిచ్చిన జగనన్న స్వయంగా తమ పల్లెకు నడచి వస్తున్నాడని తెలిసి పనులన్నీ పూర్తిచేసుకుని అడుగులో అడుగేస్తున్నారు. ప్రజాసంకల్పం నెరవేరాలని జననేతను అనుసరిస్తున్నారు.

వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజాసంకల్పయాత్రకు రోజురోజుకూ జనస్పందన విశేషంగా పెరుగుతోంది. పల్లెలన్నీ పాదయాత్రలో మేము సైతమంటూ పాలుపంచుకుంటూ విపక్ష నేతకు మద్దతు పలుకుతున్నాయి. జగన్ పాదయాత్ర శనివారం పుంగనూరు నియోజకవర్గంలో దిగ్విజయంగా కొనసాగింది.





• జీవిత చక్రం



కుమ్మరి చక్రాన్ని ఆసక్తిగా పరిశీలిస్తూ..

• చెరగని జ్ఞాపకం



సంతోష సెల్ఫీ : అన్నతో ఆప్యాయంగా సెల్ఫీ దిగుతున్న చెల్లెమ్మ

• ఏమైంది తల్లీ



చల్లావారిపల్లె వద్ద అంధురాలితో మాట్లాడుతున్న జగనన్న

• ఆత్రుత



శ్రీనివాసపురంలో ట్రాక్టర్ పైకెక్కి ఎదురు చూస్తున్న అభిమానులు

• నేనున్నానని



చల్లావారిపల్లె వద్ద అవ్వాతాతలను ఆప్యాయంగా పలకరిస్తూ..

• మీకు అండగా ఉంటా..



భరోసా : అన్నతో కష్టాలు పంచుకుంటున్న అక్కాచెల్లెమ్మలు

• అధైర్యమొద్దు



ఏద్యకమ్మ : కష్టాలు తెలియజేస్తూ..

కడదాక జగనన్న వెంటే..



ఇచ్ఛాపురం వరకు జగనన్నతోనే.. ప్రజా సంకల్పయాత్రలో మేము సైతం అంటూ పలువురు భాగస్వాములవుతున్నారు. ఇందులో వృద్ధులు, దివ్యాంగులు ఉండడం పలువుర్ని ఆలోచింపజేస్తోంది. అనంతపురానికి చెందిన సాకే ఆంజనేయులు (31), జి రోజా (26) దివ్యాంగులు. వీరు అనంతపురం నుంచి మూడు చక్రాల బండిలో పుంగనూరు నియోజకవర్గం సదుం మండలంలోని గాండ్లపల్లెకు చేరుకున్నారు. అక్కడి నుంచి ప్రతిపక్ష నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో కలిసి పాదయాత్ర ప్రారంభించారు. ఇచ్ఛాపురం వరకు తమ అభిమాన నేతతో కలిసి పాదయాత్ర సాగిస్తామని ధీమా వ్యక్తం చేశారు.

– బి.కొత్తకోట

క్రీడాకారులకు అండగా ఉండాలి



'అన్నా.. చదువుకుని ఆటల్లో బాగా రాణిస్తా ఉండే క్రీడాకారులకు అండగా నిలబడి మీరు భరోసా ఇవ్వాలి. మీ మాట కోసం క్రీడాకారులు ఆశగా ఎదురు చూస్తా ఉండారు..' అంటూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్‌కె.ఇమామ్ కోరారు. పుంగనూరు నియోజకవర్గంలోని చల్లావారిపల్లె సమీపంలో జననేతను కలిసి క్రీడాకారుల కష్టాలు తెలియజేశారు. వారికి అండగా ఉండాలని కోరారు.

– చిత్తూరు అర్బన్

నా బిడ్డకు ప్రాణభిక్ష పెట్టండి సామి



'సెట్టంత కొడుకయ్యా.. ఇప్పటికే రెండు సార్లు ఆపరేషన్లు చేయించినాం. అయినా వాడి పరిస్థితి మార్లేదు. మీరే ఆదుకోవాలి. నాబిడ్డకు ప్రాణభిక్ష పెట్టాలి సామీ..' అంటూ పుంగనూరు నియోజకవర్గంలోని చల్లావారిపల్లె పంచాయతీ శ్రీనివాసపురానికి చెందిన ఎం.రత్నమ్మ కోరారు. ప్రజాసంకల్పయాత్రలో జననేతను కలిసిన ఆమె తన కుమారుడు ఆంజనేయుల్ని చూపించారు. 21 ఏళ్ల వయస్సున్న కొడుకుకు తలలో ఓ గడ్డ ఉందని.. రెండు సార్లు ఆపరేషన్లు చేయించినా ఫలితం లేకుండా పోతోందన్నారు. ప్రైవేటు ఆస్పత్రుల్లో వైద్యం చేయించడానికి తమ వద్ద అంత డబ్బుల్లేవని ఆవేదన వ్యక్తం చేశారు. ఆంజనేయులకు మెరుగైన వైద్య సేవలందించడానికి వెంటనే చర్యలు చేపట్టాలని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన సిబ్బందిని ఆదేశించారు.

టూరిజం..ప్రయివేటిజం



'రాష్ట్ర టూరిజం శాఖను ప్రైవేటుపరం చేయడానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కుట్ర పన్నుతున్నారని' ఆ శాఖ ఉద్యోగుల సంఘం నాయకులు ఆరోపించారు. 2014 ఎన్నికలకు వెళ్లకమునుపు అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేస్తామని చెప్పిన తెలుగుదేశం పార్టీ.. నాలుగేళ్లు కావస్తున్నా ఇప్పటి వరకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలేదన్నారు. ప్రజాసంకల్పయాత్రలో భాగంగా చిత్తూరు జిల్లాలో పాదయాత్ర చేస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని రాష్ట్ర టూరిజం అభివృద్ధి సంస్థ ఉద్యోగుల సంఘం నాయకులు కలిసి వినతిపత్రం అందచేశారు. తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు.

ఆహా ఏమి రుచి..

సాక్షి హెల్దీ కిచెన్స్‌కు అనూహ్య స్పందన


కార్యక్రమానికి హాజరైన మహిళలు


వంట చేస్తున్న చెఫ్

అనంతపురం కల్చరల్:

సాక్షి మైత్రి మహిళ, ఫ్రీడం రైస్ బ్రాన్ ఆయిల్ సంయుక్తంగా శనివారం నిర్వహించిన హెల్దీకిచెన్స్ కార్యక్రమానికి అనూహ్య స్పందన లభించింది. సంప్రదాయ వంటకాలే కాకుండా పాశ్చాత్య రుచులనూ ఇంటి వద్దే తయారు చేసుకునే విధానాన్ని చెఫ్ వివరించారు. స్థానిక అశోక్‌నగర్ లోని భూపాళం ఫంక్షన్ హాల్ లో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో 134 మంది మహిళలు పాల్గొని సరికొత్త వంటకాల తయారీని పరిశీలించారు. వంటింటి టిప్స్ అందించిన పది మందికి ఆత్మీయ అతిథిగా విచ్చేసిన మేయర్ స్వరూప బహుమతులందించారు. అలాగే మొదటగా తమ పేర్లను నమోదు చేసుకున్న మరో పది మంది మహిళలతో పాటు లక్కీ డ్రా ద్వారా ఐదుగురు విజేతలను ప్రకటించి వారికి సాక్షి బ్రాంచ్ మేనేజర్ కేదార్‌నాథరెడ్డి, టీవీ చానెల్ బ్యూరో ఇన్‌చార్జి శివారెడ్డి, సర్క్యులేషన్ మేనేజర్ విష్ణు వర్ధనరెడ్డి తదితరులు బహుమతులందించారు.


వివిధ రకాల వంటకాలు

కొత్త వంటలు నేర్చుకున్నా



కొత్తరకం వంటలు ఇలా చేయవచ్చునని ఊహించలేదు. ఇంట్లో ఉండే వస్తువులతో సరికొత్త రుచులు ఇంటిల్లిపాదికి అందించవచ్చని తెలుసుకున్నాను. ఫిజ్జా బర్గర్ వంటి వాటిని ఎక్కువగా ఈతరం వారు ఇష్టపడుతున్నారు. ఆరోగ్యం దృష్ట్యా ఇన్నాళ్లు భయపడేవాళ్లం. ఇప్పుడా భయం పోయింది.

– స్వప్న, గృహిణి, రామనగర్, అనంతపురం

ప్రయోగం చేయాలనుంది



సాక్షి గ్రూప్ వారు నాకు చక్కని అవకాశం కల్పించారు. యాంకరింగ్‌ను ఎంజాయ్ చేస్తూనే సరికొత్త వంటకాల గురించి తెలుసుకునే అవకాశం వచ్చింది. వెంటనే ఆదివారం వస్తోంది కాబట్టి వంటింట్లో ప్రయోగం చేయాలనుంది. మహిళలందరికీ చక్కటి అవకాశం కల్పించిన సాక్షి వారిని అభినందించకుండా ఉండలేం.

– నీలు, యాంకర్, అనంతపురం


మేయర్ స్వరూప నుంచి బహుమతి అందుకుంటున్న విద్యావతి

అభినందనీయం..

మేయర్ మాట్లాడుతూ సాక్షి, ఫ్రీడమ్ ఆయిల్ గ్రూప్ వారు ఇలాంటి కార్యక్రమాలు మరిన్ని జరగాలని ఆకాక్షించారు. బయటి తిండి తిని ఆరోగ్యం చెడుగొట్టుకోవడం కన్నా.. ఇంటి వద్దనే అద్భుతమైన రుచులను సిద్ధం చేసుకోవడంలో మెలకువలను తెలిపిన చెఫ్ డేనియల్ ఆర్.చక్రంను, నిర్వాహకులను అభినందించారు.

తొమ్మిదిగంటల్లో రెండెకరాల పప్పుశనగ తొలగింపు

విడపనకల్లు :

డొనేకల్లు గ్రామానికి చెందిన రాంబాబు అనే యువకుడు తొమ్మిది గంటల్లో రెండెకరాలు పప్పుశనగ పంటను తొలగించి రికార్డు సృష్టించాడు. ఉదయం 3 గంటల నుంచి మధ్యాహ్నం12 గంటల వరకు ఏకధాటిగా పప్పుశనగ పంట తొలగించాడు.

9 గంటల్లో రెండెకరాలు పప్పుశనగ తొలగించిన వ్యక్తులు ఇంత వరకు తమ గ్రామంలో ఎవరూలేరని గ్రామస్తులు యువకుడు రాంబాబను అభినందించారు.


డొనేకల్లులో పప్పుశనగ పంటను తొలగిస్తున్న రాంబాబు

ఉష్ణోగ్రత @ 10 డిగ్రీలు

అనంతపురం అగ్రికల్చర్: జిల్లాలో పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పట్టాయి. చాలా మండలాల్లో కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతుండటంతో చలి–పులి పెరిగింది. శీతల వాతావరణం నెలకొనడంతో జనం వణుకుతున్నారు. శనివారం మడకశిర, తనకల్లు మండలాల్లో 10 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. అగళి 10.2 డిగ్రీలు, నల్లమాడ 11.2 డిగ్రీలు, సోమందేపల్లి 11.3 డిగ్రీలు, అమడగూరు 11.7 డిగ్రీలు, రొద్దం 11.8 డిగ్రీలు, హిందూపురం 12.1 డిగ్రీలు, కనగానపల్లి, ఎన్‌పీ కుంట 12.4 డిగ్రీలు, చెన్నేకొత్తపల్లి 12.5 డిగ్రీలు, కొత్తచెరువు 12.6 డిగ్రీలు, గాండ్లపెంట, తలుపుల, కంబదూరు 12.7 డిగ్రీలు నమోదైంది. మిగతా మండలాల్లో కనిష్టం 13 నుంచి 16 డిగ్రీలు, గరిష్ట ఉష్ణోగ్రతలు 28 నుంచి 30 డిగ్రీలు మేర కొనసాగింది. గాలిలో తేమ ఉదయం 75 నుంచి 85, మధ్యాహ్నం సమయంలో 28 నుంచి 38 శాతం మధ్య రికార్డయ్యింది. ఆగ్నేయ దిశగా గాలులు గంటకు 5 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో వీచాయి. రాత్రి, పగలు ఉష్ణోగ్రతలు తగ్గిపోవడంతో జిల్లా అంతటా చలివాతావరణం వణికిస్తోంది.

రాయితీతో మినీ కోల్డ్ స్టోరేజీలు

అనంతపురం అగ్రికల్చర్: ఐదు టన్నుల సామర్థ్యం కలిగిన మినీకోల్డ్ స్టోరేజీల నిర్మాణానికి రాయితీలు ఇస్తున్నట్లు ఉద్యానశాఖ డీడీ బీఎస్ సుబ్బరాయుడు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎకో ఫ్రాస్ట్ కంపెనీ ఆధ్వర్యంలో వీటిని నిర్మించనున్నట్లు చెప్పారు. కోల్ట్‌స్టోరేజీతో పాటు రైపనింగ్ చాంబర్‌గా కూడా ఉపయోగించుకునే వీలుందన్నారు. రూ.15 లక్షల విలువ చేసే యూనిట్‌కు రైతు ఉత్పత్తి దారుల సంఘాల (ఎఫ్‌పీవో)కు 70 శాతం, మిగతా రైతులకు 30 శాతం రాయితీ వర్తిస్తుందన్నారు. వీటితో పాటు అరటి చిప్స్ తయారీ యూనిట్‌కు, ఫ్రీ ఫ్యాబ్రికేటెడ్ గదుల నిర్మాణానికి కూడా రాయితీల కోసం రైతులు ఉద్యానశాఖ అధికారులను సంప్రదించాలన్నారు.

మదరసాలు అభివృద్ధి బాట పట్టాలి


మాట్లాడుతున్న పీఓ సుబ్రమణ్యం

అనంతపురం ఎడ్యుకేషన్: మదరసాలు అభివృద్ధి బాట పట్టేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని సర్వశిక్ష అభియాన్ ప్రాజెక్ట్ ఆఫీసర్ సుబ్రమణ్యం కోరారు. ఐదు రోజుల పాటు మదరసాల వలంటీర్లకు జరిగే శిక్షణ స్థానిక మహిళా సమాఖ్య కార్యాలయంలోని సమావేశ హాలులో శనివారం ప్రారంభమైంది. పీఓ మాట్లాడుతూ మదరసాల్లో చదివే పిల్లలకు చదువుతో పాటు అన్ని విషయాల్లోనూ అవగాహన కల్పించాలన్నారు. అభివృద్ధి చెందుతున్న సాంకేతికను సద్వినియోగం చేసుకొని పిల్లల్ని సమాజానికి ఉపయోగపడేలా తీర్చి దిద్దాలన్నారు. మదరసాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందన్నారు. జిల్లాలో మరిన్ని మదరసాలు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. బోధనలో కొత్త పద్ధతులు అవలంబించి విద్యార్థుల్లో ఆసక్తి నింపాలని వలంటీర్లకు సూచించారు. సమావేశంలో అలెస్కో బాలమురళీకృష్ణ, అసిస్టెంట్ అలెస్కో శ్రీదేవి, ఏఎంఓ జయచంద్రనాయుడు, అసిస్టెంట్ ఏఎంఓ (ఉర్దూ) ఆరీఫ్, అసిస్టెంట్ ఏఎంఓ శ్రీరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైల్వే కాంట్రాక్టర్ శ్రీరామ్‌చౌదరిపై ఎస్సీ,ఎస్టీ కేసు నమోదు

గుంతకల్లు: రైల్వే కాంట్రాక్టర్ శ్రీరామ్‌చౌదరిపై వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో ఎస్సీ, ఎస్టీ కేసు నమోదైనట్లు పోలీసులు తెలిపారు. ఆలస్యంగా వెలుగు చూసిన ఈ కేసు వివరాలు ఇలా.. భాగ్యనగర్‌కు చెందిన డి.రమేష్ టిఫిన్ సెంటర్ నిర్వహిస్తున్నాడు. రమేష్‌కు రైల్వే కాంట్రాక్టర్ శ్రీరామ్‌చౌదరి పరిచమయ్యాడు. 2016 జూలై గుంతకల్లు రైల్వే రన్నింగ్ రూమ్ కాంట్రాక్టు తనకు వచ్చిందని, అందులో షేర్ ఇస్తానంటూ నమ్మబలికి రమేష్ నుంచి రూ.15 లక్షలు తీసుకున్నాడు. భార్య బంగారు నగలు, తెలిసిన వ్యక్తుల వద్ద మరో రూ.15 లక్షలు దాకా అప్పు చేసి శ్రీరామ్‌చౌదరికి ఇచ్చినట్లు రమేష్, ఈయన భార్య డి.నరసమ్మ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పులిచ్చిన వ్యక్తుల నుంచి ఒత్తిళ్లు అధికం కావడంతో శ్రీరామ్‌చౌదరిని అడిగితే బెదిరింపులకు దిగాడు. 2017 ఆగస్టు 17న శ్రీరామ్‌చౌదరి, భార్య నాగమణి గౌడ్ అతని అనుచరులు తమ ఇంటిపైకి వచ్చి కులం పేరుతో దూషించడంతోపాటు మహిళ అని చూడకుండా దుర్భాషలాడినట్లు రమేష్ భార్య నరసమ్మ ఫిర్యాదులో పేర్కొంది. ఈ ఘటనపై విచారణ జరిపి ఈనెల 3న శ్రీరామ్‌చౌదరి, అతని భార్య నాగమణిగౌడ్, ప్రసాద్, పి.మహబూబ్‌బాషా, బెల్డోన రవి, డేరంగుల ఉదయ్‌కిరణ్, ఎస్‌కే వలిలపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఒత్తిళ్ల ఫలితమే ఎస్సీ,ఎస్టీ కేసు

